సాక్షి చిత్తూరు

సోమవారం ׀ 2 ׀ జనవరి ׀ 2023



చిత్తూరు బులియన్

| | |
|---|---|
| **బంగారం :** | |
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.54,000 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,000 |
| **వెండి:** | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.69,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.72 |

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 30 | 18 |
| తిరుపతి | 31 | 19 |
| తిరుమల | 26 | 15 |
| గూడూరు | 31 | 21 |
| నగరి | 31 | 19 |



## పోలీసు శాఖ నూతన సంబరం

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు శాఖ నూతన సంవత్సర సంబరాలు చేసుకుంది. డీఎస్పీ శ్రీనివాస మూర్తికి ఎస్పీ రిషాంత్‌రెడ్డి కేక్ తినిపించారు. దిశ స్టేషన్ డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ బాలయ్య ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

## న్యూస్‌రీల్

### నేడు కలెక్టరేట్‌లో స్పందన

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేడు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు నిర్వహించే స్పందనలో ప్రజలు అర్జీలు అందజేసి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఆయా శాఖల అధికారులు దీనికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

### నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

**చిత్తూరు అర్బన్:** నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

### రేషన్ బియ్యం ఉచితం

**చిత్తూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ పీడీఎస్ కింద బియ్యాన్ని కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తోందని డీఎస్‌ఓ శంకరన్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 5 లక్షలకుపైగా రేషన్‌కార్డులు ఉండగా, వీరందరికీ ఈనెల ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కందిపప్పుకు మాత్రం నిర్ణీత ధర చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సరుకులన్నీ రేషన్ బండి ద్వారా ఇంటి వద్దే సరఫరా చేయనున్నట్లు వివరించారు. కార్డుదారులు చౌక దుకాణానికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ ఎవరైనా దుకాణానికెళ్లి రేషన్ తీసుకోవాలని చెబితే వెంటనే ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

### చురుగ్గా పింఛన్ల పంపిణీ

**చిత్తూరు అగ్రికల్చర్:** జిల్లాలోని సామాజిక పింఛన్ దారులకు ప్రభుత్వం అందించే వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాలను ఆదివారం వలంటీర్లు పంపిణీ చేశారు. వేకువ జాము నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల మొత్తాలను నేరుగా అందించారు. మొత్తం 2,67,384 పింఛన్లకు గాను సాయంత్రానికి 2,09,763 మందికి అందించి 78.45 శాతం పంపిణీ పూర్తి చేశారు. నూతన సంవత్సరం రోజున పెంచిన పింఛన్ మొత్తాలు చేతికందడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది.

### నేడు జిల్లాకు ప్రద్యుమ్న రాక

**చిత్తూరు కలెక్టరేట్ :** ఎలక్టోరల్ అబ్జర్వర్ ప్రద్యుమ్న సోమవారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించి, అనంతరం పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

## అదివో భువి వైకుంఠం



వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ తిరుమలలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టింది. శ్రీవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేసింది. సోమవారం నుంచి పది రోజులపాటు భక్తులను వైకుంఠ ద్వార దర్శనభాగ్యం కల్పించనుంది.

- వివరాలు 8లో

## వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం



తిరుపతి సమీపంలోని తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో శోభాయమానంగా పుష్పాలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- వివరాలు 10లో

# జగనన్న పెంచిన పింఛన్

### ఈ సాయం మరువలేను



నా పేరు శాంత. మాది చిత్తూరులోని 29వ డివిజన్. నా భర్త చనిపోయారు. వితంతు పెన్షన్ వస్తోంది. మూడు దఫాలుగా పెన్షన్ పెంపు చేస్తూ ఈ నెల నుంచి రూ.2,750 ఇచ్చారు. దీంతోపాటు మా ఇద్దరమ్మాయిల్లో మొదటి పాప ఇంజినీరింగ్ చదువుతోంది. తనకి వసతిదీవెన, విద్యాదీవెన అందుతోంది. రెండో అమ్మాయికి అమ్మఒడి కింద లబ్ధి చేకూరింది. అనుప్పల్లె లేఅవుట్‌లో ఇల్లు మంజూరు చేశారు. ఈ ప్రభుత్వం మా కుటుంబానికి చేసిన సాయాన్ని మరువలేను.

### జగన్ పాలన బాగుంది



మాది చిన్నమ్మ గుడి పల్లె. నాపేరు గోవిందస్వామి. నేను మేస్త్రిగా పని చేస్తాను. ఆరోగ్యరీత్యా ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమైంది. భార్య కూలి పనికి వెళ్తోంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం నాకు పెన్షన్ మంజూరు చేసింది. ఇది ఆర్థికంగా ఎంతో దోహదపడుతోంది. పింఛన్‌తోపాటు ఇల్లు మంజూరు చేశారు. ఒకరి మీద ఆధారపడకుండా మేము జీవనాన్ని సాగించేందుకు మార్గం చూపిన జగనన్న పాలనకు హ్యాట్సాఫ్.





పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఇన్‌చార్జి కలెక్టర్ వెంకటేశ్వర్, హాజరైన లబ్ధిదారులు

జగనన్న ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ దశలవారీగా పెంచుతున్నారు. గత ఏడాది రూ.2 వేల నుంచి 2,500కు పెంచగా, ఈ ఏడాది 2,750కి పెంచారు. పింఛనుదారులకు నూతన సంవత్సరం కానుకగా పెంచిన పింఛను అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతం పెరిగినట్లు పింఛన్ కూడా ఏడాదికోసారి పెంచుతుండడంతో అవ్వాతాతల ముఖాలు సంతోషంతో వెలిగిపోతున్నాయి. వచ్చే ఏడాది జనవరికి ఈ పింఛన్ రూ.3 వేలకు చేరుతుందని అధికారులు చెబుతుండడంతో పింఛనుదారులు ఆనందడోలికల్లో ఓలలాడుతున్నారు.

- అవ్వాతాతల ముఖాల్లో విరిసిన సంతోషం
- పింఛనుదారులకు రూ.2,750 అందజేత
- పింఛన్ల పంపిణీలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

**సాక్షి, చిత్తూరు:** ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు అందించే పింఛన్లపై తొలి సంతకం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు కొనియాడారు. చిత్తూరులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అవ్వా తాతలకు జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ పింఛను కానుక కింద గతంలో ఇస్తున్న రూ.2,500 నుంచి రూ.2,750కి పెంచినట్లు తెలిపారు. ఇదే క్రమంలో వచ్చే ఏడాది జనవరి నుంచి ఈ పింఛన్‌ను రూ.3 వేలకు పెంచనున్నట్లు వివరించారు. జగనన్న ప్రభుత్వంలో దాదాపుగా 64 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సీఎం ఇచ్చిన మాట ప్రకారం ఈ జనవరి నుంచి పింఛన్‌ను రూ.2,750కు పెంచి ఇస్తున్నారన్నారు. రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్ర రెడ్డి మాట్లాడుతూ అవ్వాతాతల ముఖంలో చిరునవ్వు చూసేందుకు అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోని విధంగా మన రాష్ట్రంలో సీఎం ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే ఇంటి వద్దకే పింఛన్లను అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. మన రాష్ట్రంలో కోటి 50 లక్షల కుటుంబాలు ఉంటే అందులో 60 లక్షల కుటుంబాలకు సుమారు 65 లక్షల పింఛన్లను అందజేస్తున్నామన్నారు.

### పింఛన్ల పంపిణీ ఇలా

నియోజకవర్గాల వారీగా చిత్తూరులోని 28,903 మందికి రూ.7.98కోట్లు, గంగాధరనెల్లూరు లోని 43,381 మందికి రూ.11.79 కోట్లు, కుప్పంకు చెందిన 36,300 మందికి రూ.10.09 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇక నగరిలోని 23,279 మందికి రూ.6.34 కోట్లు, పలమనేరులోని 44,836 మందికి రూ.12.34 కోట్లు, పుంగనూరులోని 44,181 మందికి రూ.11.98 కోట్లు, పూతలపట్టుకు చెందిన 46,916 మందికి రూ.12.49 కోట్లు లబ్ధి పొందనున్నారని చెప్పారు. లబ్ధిదారులకు కొత్త పింఛన్లు, సంబంధించిన మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు నగర మేయర్ అముద, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆర్వో రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ తులసి తదితరులు పాల్గొన్నారు.

### సంతోషంగా ఉంది



నా భర్త చనిపోయారు. వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి వితంతు పెన్షన్‌కు దరఖాస్తు చేయించింది. జనవరి నుంచి నాకు పెన్షన్ మంజూరు కావడం సంతోషం కలిగించింది. ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– జయమ్మ, తుమ్మిందపాళెం, చిత్తూరు

# జనసంద్రంగా ఎర్రాతివారిపల్లె



నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**సదుం:** మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం జనసంద్రంగా మారింది. వేకువ జామునుంచే స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో చేపట్టిన ప్రత్యేక అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రత్యేక పోలీసు బృందాలు, ఎన్‌సీసీ విద్యార్థులు రద్దీని నియంత్రించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు.

### ఆలయాల్లో మంత్రి పూజలు

**పులిచెర్ల(కల్లూరు) :** నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం మండలంలోని దేవళంపేటలో వెలసిన కాశీవిశ్వేశ్వర స్వామి, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో ఏర్పాటు చేసిన పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఎంపీ రెడ్డెప్ప పాల్గొన్నారు. తొలుత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి విచ్చేసిన మంత్రికి అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెండు ఆలయాల్లో పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నూతన సంవత్సరం కేక్ కట్ చేశారు. రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్‌ఎస్ రెడ్డి ప్రకాష్, మంత్రి పీఏ మునితుకారాం, ఎంపీటీసీలు పోకల చంద్ర, మంజుల, సర్పంచ్‌లు రాణెమ్మ, షుకూర్, హేమచంద్రారెడ్డి, నాధమునిరెడ్డి, రాయల్ మోహన్, విజయ కుమార్, శ్రీనివాసులు, దామోధర్, గోవింద రెడ్డి, దేవేంద్రరెడ్డి, రమణ, కోదండ పాల్గొన్నారు.

# ప్రజా సేవకు అంకితమవ్వాలి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



డిప్యూటీ సీఎం నారాయణస్వామిని సన్మానిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

**కార్వేటినగరం :** ప్రజాసేవకు అంకితమవ్వాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పుత్తూరు క్యాంపు కార్యాలయంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు మంత్రిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పని చేసి జీడీనెల్లూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పునరంకితం కావాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రజల సంక్షేమాన్ని కోరే పార్టీగా అవతరించిందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లవేళలా తోడూనీడగా ఉండి, అన్ని విధాలా ఆదుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ ధనుంజయవర్మ, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, వెదురుకుప్పం ఎంపీపీ బండి నాగరాణి, జెడ్పీటీసీ సభ్యులు సుకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, ఆరు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మంత్రికి జెడ్పీ చైర్మన్ శుభాకాంక్షలు



మంత్రి పెద్దిరెడ్డి జ్ఞాపికను అందజేసిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

**చిత్తూరు కార్పొరేషన్:** అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సదుంలోని ఆయన నివాసంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

### బోయకొండ కిటకిట



ఆలయంలో భక్తుల రద్దీ

**చౌడేపల్లె:** ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని ఆదివారం గంగమ్మ తల్లి దీవెనలకోసం భక్తులు అధిక సంఖ్యలో బోయకొండకు తరలి వచ్చారు. నిర్వాహకులు, అర్చకులు అమ్మవారిని బంగారు ఆభరణాలతోపాటు, రంగు రంగు పూలతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొండపై భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ మధుసూదనరెడ్డి బందోబస్తు ఏర్పాటుచేశారు.

# అన్నప్రసాద వితరణ భవనం ప్రారంభం





అన్న ప్రసాదానికి హారతి ఇస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, అన్న ప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

- పాత అన్నదాన కాంప్లెక్స్ పునఃప్రారంభం
- నిరంతరాయంగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ
- ఒక్క రోజులోనే లక్షన్నర టోకెన్లు జారీ చేసిన సిబ్బంది
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి

**తిరుమల:** తిరుమలలోని పీఏసీ -4 (పాత అన్నదానం కాంప్లెక్స్)లో ఆదివారం సాయంత్రం నుంచి అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నప్రసాదం స్వీకరణకు వచ్చిన భక్తులతో ఆయన మాట్లాడారు. 1985 నుంచి 2011 జులై 7వ తేదీ వరకు ఈ భవనంలో అన్నదానం కార్యక్రమం జరిగిందన్నారు. భక్తుల సంఖ్య పెరగడంతో వారి సదుపాయం కోసం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనాన్ని నిర్మించామన్నారు. అన్న ప్రసాదం కేంద్రానికి భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో తిరుమలలోని నాలుగు ప్రాంతాల్లో మినీ అన్నదానం భవనాలు ప్రారంభించాలని ధర్మకర్తల మండలి నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా తిరిగి పాత అన్నదాన భవనాన్ని ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ఇక్కడ రోజుకు 15వేల మందికి అన్నదానం జరుగుతోందన్నారు. దీంతోపాటు మరో మూడు చోట్ల మినీ అన్నదాన భవనాలు ప్రారంభించి భక్తులు తాము వసతి పొందిన ప్రాంతాలకు సమీపంలోనే సులువుగా స్వామివారి అన్నప్రసాదం తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామని టీటీడీ చైర్మన్ పేర్కొన్నారు.

**ఇప్పటివరకు లక్షన్నర టోకెన్లు జారీ**

తిరుమలలో 10రోజుల పాటు జరిగే వైకుంఠ ద్వార సర్వదర్శనం కోసం వచ్చే భక్తులకు తిరుపతిలోని 9ప్రాంతాల్లో ఆదివారం నుంచి టోకెన్లు జారీ చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు సుమారు లక్షన్నర టోకెన్లు జారీచేశారన్నారు. 10రోజుల కోటా పూర్తయ్యే వరకు నిరంతరంగా టోకెన్లు జారీ చేస్తామని తెలిపారు. సర్వదర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. భక్తులు టోకెన్లు తీసుకుని వారికి కేటాయించిన సమయానికే తిరుమలకు రావాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. తిరుమలలోని క్యూలలో కూడా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు వైద్యనాథన్ కృష్ణమూర్తి, అదనపు ఈఓ వీరబ్రహ్మం, అన్నదానం డిప్యూటీ ఈఓ సెల్వం, ప్రత్యేకాధికారి శాస్త్రితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



శిల్పారామంలో డ్యాన్స్ చేస్తున్న ఝాన్సీ బృందం

**తిరుచానూరు:** నూతన సంవత్సరం సందర్భంగా శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కోటి ఈవెంట్స్ గ్రూప్ కళాకారులు ప్రదర్శించిన ఐకాన్ డ్యాన్స్‌షో, నెల్లూరుకు చెందిన చాందినీ బృందం డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే కమెడియన్ రాజమౌళి, ఝాన్సీ నృత్యం, మిమిక్రీ, తిరుపతికి చెందిన కళాకారులు ప్రదర్శనలు చూపరులను అలరించాయి. అమ్యూజ్‌మెంట్, బోటింగ్ ఆహ్లాదాన్ని కలిగించాయి.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

# అదివో భువి వైకుంఠం

**ముక్కోటి వేడుకలకు తిరుమల ముస్తాబు ● నేటి నుంచి ఉత్తర ద్వార దర్శనం**



తిరుమలలో ఆకట్టుకుంటున్న మహా విష్ణువు నమూనా ఆలయం

**తిరుమల :** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలను కనులపండువగా అలంకరించారు. విద్యుద్దీపాలు, విశేష పుష్పాలతో తీర్చిదిద్దారు. సోమవారం వేకువజాము నుంచి వైకుంఠ ద్వారం దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి గతంలో రెండు రోజులు మాత్రమే భక్తులను అనుమతించేవారు. 2020 నుంచి పది రోజులపాటు భక్తులకు ఉత్తర ద్వార ప్రవేశం కల్పించే సంప్రదాయానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. వేంకటాచల మహత్యంలో పేర్కొన్నట్లు వైకుంఠ ఏకాదశి నుంచి పదిరోజులపాటు ముక్కోటి దేవతలు శ్రీవారిని సేవించుకుంటారు. ఉత్తరద్వారం నుంచి శ్రీవారు సకల దేవతలకు దర్శనమిస్తారు. ఇదే సమయంలో శ్రీమహావిష్ణువును దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం.



విద్యుత్ వెలుగుల్లో శ్రీవారి ఆలయం



## పర్యాటక కేంద్రంగా మల్లప్పకొండ



మల్లప్పకొండపై మల్లేశ్వరస్వామి పూజల్లో ఎమ్మెల్సీ భరత్

**గుడుపల్లె:** పర్యాటక కేంద్రంగా మల్లప్పకొండ ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన ఆదివారం మల్లప్పకొండ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ గ్రాంట్ నుంచి రూ.25 లక్షలు, జెడ్పీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ గోడ పనులకు ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు వేగంగా జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, సర్పంచ్ అమరనాథ్, ఎంపీటీసీ వెంకటమ్మ, నాయకులు సంపంగి పాల్గొన్నారు.

### ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

**ఎర్రావారిపాళెం:** మండలంలోని చింతగుంటలో ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. నెరబైలుకు చెందిన కన్నప్ప(46) చింతగుంట చిన్నబైలు పచ్చారువాండ్లపల్లె వద్ద మామిడితోటలో పని ముగించుకుని ట్రాక్టర్‌లో వస్తుండగా బసిరెడ్డి చెరువు కట్టపై నుంచి బోల్తా పడింది. దీంతో కన్నప్ప అక్కడికక్కడే మరణించాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



ట్రాక్టర్ కింద కన్నప్ప మృతదేహం

## వైకుంఠ ఏకాదశికి ఘనంగా ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో వైకుంఠనాథ స్వామి

**నగరి :** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని టీటీడీ ఆధీనంలో ఉన్న కరియమాణిక్య స్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శనం కల్పించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సాలువ రాజుల పాలనలో నిర్మించిన ఆలయం గజేంద్రమోక్షానికి ప్రతీతి. ఆలయాన్ని టీటీడీ అధికారులు జీర్ణోద్ధరణ గావించి వైకుంఠద్వార దర్శనం కల్పించేలా ఆలయాన్ని నిర్మించారు. దీంతో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకొని టీటీడీ అధికారులు ఆలయాన్ని విద్యుత్ దీపా పుష్పాలంకరణలు చేశారు. తిరుమల ఆలయం తరు వాత జిల్లాలో టీటీడీ ఆధీనంలో ఉన్న ఆలయాల్లో వైకుంఠద్వార దర్శనం ఇక్కడ మాత్రమే ఉంది. సోమవారం ఉదయం నుంచే అభిషేకాలు చేపట్టి, ప్రత్యేక అలంకరణ చేస్తామని 5 గంటల నుంచి దర్శనం కల్పిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

**వైకుంఠనాథస్వామి ఆలయంలో**

మండలంలోని తెరణి వైకుంఠనాథస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించనున్నారు. 500 ఏళ్ల క్రితం శ్రీకృష్ణదేవరాయల పాలనలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం చెబుతోంది. వందేళ్ల క్రితం నుంచి బ్రాహ్మణ కుటుంబీకులు ఆలయ పర్యవేక్షణ చేపడుతున్నారు. లోక్‌సభ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్ సతీమణికి తెరణి స్వగ్రామం కావడంతో ఆయన గ్రామంలోని ఆలయ విశిష్టతను తెలుసుకొని తనవంతు సహకారం అందించారు. ప్రస్తుతం ఆలయానికి ఉన్న మాన్యం భూముల నుంచి వచ్చే స్వల్ప ఆదాయంతో ధూప, దీప నైవేద్యం కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడవాహనంపై స్వామిని ఊరేగిస్తారు. సోమవారం వైకుంఠ ఏకాదశి కావడంతో ఏర్పాట్లు భారీగా నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటలకు గరుడసేవ నిర్వహిస్తామని సర్పంచ్ నిర్మల డింపుల్ తెలిపారు. బుగ్గకాశీవిశ్వేశ్వర ఆలయంలోనూ వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఏకాదశి ఉత్సవాలతో పాటు ఆలయ అన్నదాన సమాజ కమిటీ వార్సికోత్సవ ఉత్సవాలు జరగనున్నాయి. టీటీడీ వారిచే పాటకచ్చేరి, హరికథా కాలక్షేపము నిర్వహించనున్నారు.



### చెట్టును ఢీకొన్న కారు

- ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు



తేజస్‌సంజయ్ మృతదేహం

**ఏర్పేడు :** మండలంలోని పంగూరు గ్రామం వద్ద ఆదివారం కారు అదుపు తప్పి చెట్టుని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. సీఐ శ్రీహరి కథనం మేరకు.. మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా రాచకర్ల గ్రామానికి చెందిన ఆరుగురు కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో కారులోని తేజస్‌సంజయ్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. సూరత్ (38), విశాల్(35), అక్షయ్(32), అవినాష్(27), డ్రైవర్ శ్రీరంగ పటేల్(32) గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. తేజస్ సంజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



రమణమ్మ మృతదేహం

**కోట :** మండలంలోని ఉత్తమ నెల్లూరు మలుపు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. గోవిందపల్లిపాళానికి చెందిన రమణమ్మ(52) తన అల్లుడు శ్రీరాములుతో కలసి బైక్‌పై కొక్కుపాడుకు వస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రమణమ్మ తలకు తీవ్రమైన గాయమైంది.108 లో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

### మహిళ మెడలో గొలుసు చోరీ

**సైదాపురం :** మండలంలోని తోచాం గ్రామానికి చెందిన మహిళ మెడలో నుంచి శనివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు గొలుసు లాక్కెళ్లారు. ఈ మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు.. గ్రామంలోని తోటలో పనులు చూసుకున్న తిరుమలపూడి పద్మ ఇంటికి వస్తుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డగించి నాలుగు సవర్ల గొలుసు లాక్కున్నారు. గొలుసు విలువ సుమారు రూ.1.80లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

### యువకుడి దారుణ హత్య



వెంకటేష్ ( ఫైల్ )

**నాయుడుపేటటౌన్ :** పట్టణంలోని పాగొట్టం కాలనీలో ఆదివారం వేకువజామున ఓ యువకుడని దారుణంగా హత్య చేశారు. వివరాలు.. మండలంలోని మర్లపల్లె గ్రామానికి చెందిన వేలూరు వెంకటేష్ (28) తన సోదరుడు నరేంద్రసాయి, తల్లిదండ్రులు పుల్లమ్మ, శ్రీనివాసులుతో కలిసి పాగొట్టం కాలనీలో నివసిస్తున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అదే కాలనీనికి చెందిన పయ్యల గిరి, అతడి సోదరుడు హరితో కొంతకాలంగా వెంకటేష్‌కు వివాదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో న్యూ ఇయర్ వేడుకలు ముగించుకుని ఇంటికి చేరుకుంటున్న వెంకటేష్‌పై రాత్రి ఒంటి గంట సమయంలో హరి, గిరి మరో ముగ్గురితో కలిసి కత్తులతో దాడి చేశారు. ముందుగా వెంకటేష్ గొంతు కోసి, కింద పడిన తర్వాత ఛాతీలో పొడిచేశారు. వెంకటేష్ కేకలు వేయడంతో సోదరుడు నరేంద్ర సాయి ఇంటి బయటకు రావడంతో అతడిపై రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు ఘటన స్థలానికి చేరుకున్నారు. వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

### హనుమతేశ్వర క్షేత్రంలో చోరీ

**నగరి :** మండలంలోని గుండ్రాజుకుప్పం హనుమతేశ్వర క్షేత్రంలోని ఈశ్వరాలయం, సరస్వతి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు నూతన సంవత్సరాది సందర్భంగా ఆదివారం ఉదయం హనుమతేశ్వర క్షేత్రానికి వెళ్లిన గ్రామస్తులు సరస్వతి, ఈశ్వర ఆలయాలు తెరచి ఉండడం, ఈశ్వరునికి అలంకరించిన వెండి నాగపడగ, సరస్వతి దేవి మెడలో బంగారు తాళిబొట్టు (సవరం), హుండీని చోరీ చేసినట్లు కనుగొన్నారు. దీన్ని గ్రామ పెద్దలు ఆలయాలకు వెళ్లి నిర్ధారించారు. అయితే గుండ్రాజుకుప్పంలో గత నెల 28వ తేదీ రాత్రి పంచలోహ విగ్రహాలు తీసుకెళ్లిన సమయంలోనే ఈ ఆలయంలోనూ, చోరీ జరిగిందా, మరేదైనా రోజు జరిగిందా అనే అంశంపై స్పష్టత లేదు. ఈ మేరకు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.

# భక్తులతో పోటెత్తిన కాణిపాకం



ఆలయ ఆవరణలో భక్తులకు ఉచితంగా అన్న ప్రసాదం అందిస్తున్న అధికారులు



భక్తులతో నిండిపోయిన ఆలయంలోని క్యూలు

**కాణిపాకం(యాదమరి):** ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామివారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి తాకిడి మొదలు కావడంతో కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100, ఉచిత క్యూలన్నీ భక్తులతో నిండిపోయి, ఆలయం వెలుపల వరకు భక్తులు బారులు తీరారు. ఆలయంలో సుగంధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. వేకువజామున 3 గంటల నుంచి స్వామివారి దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు ఆ సమయం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారిని చందన అలంకరణలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఉచితంగా అన్నప్రసాదం, తాగునీరు అందించారు. అలాగే వృద్ధులకు, చంటి పిల్లల తల్లిదండ్రులకు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూల ద్వారా దర్శనం కల్పించారు.

### మరోసారి రెచ్చిపోయిన అంబులెన్స్ మాఫియా

**తిరుపతి తుడా:** రుయా ఆస్పత్రిలో అంబులెన్స్ మాఫియా మరోసారి రెచ్చిపోయింది. ప్రాణం పోయిన బాధలో ఉన్న కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేసింది. రేణిగుంటలో ఉంటున్న ఉత్తర భారత దేశానికి చెందిన వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ రుయాలో చేరి, మృతి చెందాడు. మృతదేహాన్ని రేణిగుంటకు తరలించేందుకు రుయాలో ఉన్న అంబులెన్స్ వారిని సంప్రదించారు. వారు రూ.3 వేలు డిమాండ్ చేశారు. తాము అంత ఇచ్చుకోలేమని చెప్పినా వినలేదు. రూ.800కే మృతదేహాన్ని తరలించేందుకు బయటి అంబులెన్స్ డ్రైవర్ అంగీకరించాడు. దీంతో బాధితులు మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ప్రయత్నించడంతో అక్కడి అంబులెన్స్ డ్రైవర్లు అడ్డుకుని, దాడికి ప్రయత్నించారు. ఆప్తులను కోల్పోయి బాధలో ఉన్న తమపై అంబులెన్స్ మాఫియా దౌర్జన్యం ఏమిటని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు చేసుకున్నాయి. ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేసినా ఫలితం శూన్యం. పోలీసులు కేసులు నమోదు చేసినా రుయా యాజమాన్యం అదే విధానం కొనసాగించడంపై పలు విమర్శలకు తావిస్తోంది.